# అవతారం

వాడిని అవతారం 'అని' పిలుస్తారు. వాడి అసలు పేరు
సచ్చిదానంద నిర్గుణ నిరంజన శుద్ధ బుద్ధావతారం!

అసలు వాడికీ నాకు దూరపు చుట్టరికం ఉందనుకోండి
అయినా బంధుత్వంకన్నా మిన్నగా మా యిద్దరి మధ్యా పరి
చయం విరివిగా పెనవేసుకుపోయింది. వాడు సన్నగా, ఎర్రగా
ఉంటాడు. నేను కాస్త లావుగా, నల్లగా ఉంటాను. వాడు
ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ హుషారుగా ఉంటాడు. నాలో
కాస్త దిగులుపాలు హెచ్చు. వాడు ప్రపంచాన్ని చాలావరకు
చూశాడు. అనేక విద్యలు తెలుసు. పైగా మనిషిలో మంచి
చొరవా, ధైర్యం, ఎగ్గిరా గుణాలున్నాయి. నేను మా వూ
నుంచీ ఏభై మైళ్ల దూరందాటి ఎరుగను. దానా దీనా వాడంటే
నాకు చాలా గురి ఏర్పడింది.

అవి నేను బి. ఎస్‌సి. ఫేలయి తిరుగుతున్న రోజులు. ఒ
నాడు అకస్మాత్తుగా అవతారం వూడిపడ్డాడు. వాడు వచ్చి
కొద్దిసేపటిలోనే, నాకు వాడంటే గొప్ప గౌరవం ఏర్పడిపోయింది
వాడి మాటలు విన్నవాళ్లెవరికైనా వాడి ప్రపంచానుభవ
మీద ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. వాడి వయస్సు ఇరవై
నాకు పందొమ్మిదేళ్లు. మా అమ్మ వాడిని, ఇన్నాళ్లూ ఎక్క
డెక్కడ తిరిగావురా? అని ప్రశ్నించింది. అంటే వాడు, సుమా

తన పధ్నాలుగో ఏట వాళ్ల ఇంట్లోంచి పారిపోయాడు. ఇప్పటి వరకూ ఎక్కడ ఉన్నాడో ఎవరికీ తెలియదు. అందువల్ల అలా అడిగింది. వాడు మాత్రం నాతో తరువాత, ప్రపంచం ఎలా ఉంటుందో చూడాలని బయల్దేరానన్నాడు. వాడి విజ్ఞాన తృష్ణకు నాలో నేనే జోహారులర్పించాను. అసలు అప్పట్లో నేనూ ఆ పనే చేద్దామనుకునేవాణ్ణి. పరీక్ష ఫేలయినందుకు ఇంటా బయటా తగుల్తున్న సూటిపోటి మాటలు భరించలేక, ఈ సంకుచిత వాతావరణం వదలిపెట్టి విశాల ప్రపంచంలో విహరించాలని విపరీత వాంఛ కలుగుతుండేది. ఇంట్లో చెప్పి బయల్దేరటం ఎల్లాగూ కుదరదు కాబట్టి, చెప్పకుండ కట్టు బట్టలతో హఠాత్తుగా రైలెక్కెయ్యాలని ఉండేది. అలా బయల్దేరితే అద్భుతమైన సంఘటనలు ఎదురవుతాయని నమ్మకం ఉండేది మా అవతారం మాటలు ఆ నమ్మకాన్ని చాలావరకూ బలపరచాయి. అమ్మ మాటలకు జవాబుగా, నేను చాలా వూళ్లు తిరిగాను అత్తా. ఎన్నో బిజినెస్సులు చేశాను. డబ్బు బాగా సంపాదించనూ సంపాదించాను ఖర్చు పెట్టేశాను అన్నాడు వాడు ఖర్చు పెట్టేసిన విషయం వేరే చెప్పక్కరలేకుండా వాడు వచ్చినప్పుడు, చేతిలో ఆఖరికి సంచియైనా లేకుండా, పెరిగిపోయిన జుట్టుతో, సుమారు నెలరోజుల నుంచీ చాకలి మొహం చూడని దీటా వస్త్రాలతో ప్రత్యక్షమైన ఆకారమే చెప్తోంది.

కాని వాడి అనుభవాలూ, వాడు చూసిన జీవితం నా దృష్టిలో చాలా అద్భుతమైనవిగా కన్పించాయి. స్వేచ్ఛగా

తిరుగుతూ, కొత్త కొత్త వూళ్ళల్లో, కొత్త కొత్త ప్రజలమధ్య సరదాగా ఏ దిగులూ లేకుండా, సంపాదించుకున్న డబ్బును ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకోవడం, నిజంగా ఎంత అదృష్టం! వాడు కొన్ని వూళ్ళల్లో కాఫీహోటలు సర్వరుగా పనిచేశాడు, కొన్ని వూళ్ళల్లో అంటే చిన్న పల్లెటూళ్ళల్లో సినిమాహాలులో ట్రాన్సులేటరుగా పనిచేశాడు, మరోవూళ్లో ఎలిమెంటరీస్కూల బడిపంతులుగా చలామణి అయ్యాడు. వంటబ్రాహ్మణిగా సంత ర్పణలకూ, పెళ్ళిళ్లకూ ఎన్నివందల మందికైనా వండగలడు. ఇలా ఎన్నో విద్యలలో ఆరితేరాడు. ఏవూరు వెళ్ళినా కా హోటళ్ళూ, సినిమాలు ఉండకమానవు-కాబట్టి వాడికేదిగులూ లేదు. అసలు వాడు ఇన్నివూళ్లు తిరగకుండా ఏ వూరిలోనై స్థిరపడవచ్చు కాని, వాడిలో గల భావుకతా, సౌందర్యపిపాస వాడి చంచల జీవితానికి కారణభూతాలు.

మావద్దకు వచ్చేముందర రెండు మూడు సంవత్సరా క్రితం ఒక కాఫీహోటలు నడిపాడట. అందులో ఉన్న మెలకు లన్నీ వాడికి తెలుసు. వాడి కాఫీహోటలు వ్యాపారరీత్యా బాగా నడిచిందట. మొదట ఒక్క కాఫీకొట్టుగా మాత్రమే ప్రారంభమైనా రానురాను వ్యాపారం అభివృద్ధిచెంది ఇడ్లీ దోసె, స్వీటు, హాటులను ప్రవేశపెట్టాక క్రమంగా దానిమీ కొన్ని వందలు లాభం రాసాగిందట. కాని, కొన్ని ఇతర కా ణాలవలన, ముఖ్యంగా వాడిని చూసి ఓర్వలేని కొందరి దుశ్చ ర్యల కారణంగానూ, మరికొందరి నమ్మకద్రోహ ఫలితంగాను

తనకుతానే ఆ కాఫీహోటలు ఎత్తివేసి, ఆ వూరు వదలి, మనస్సు విరిగి, కొన్నాళ్ళు ప్రశాంత జీవితం గడపాలని మావూరు వచ్చాడట.

వాడిరాక నాకు మహోపకార మనిపించింది. ఎందుకంటే, యూనివర్శిటీవారు నన్ను నమ్మించి మోసం చెయ్యడంతో, నాకు చదువుమీద మోజు తగ్గిపోయింది. అసలీ చదువులవల్ల లాభం ఏమిటి ? ప్యాసైతే నేనుచేసే ఘనకార్య మేమిటి ? ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకుని నెలకు నూరో, నూటయాభై య్యో సంపాదించడమే కదూ. అంత తక్కువ సంపాదనతో మన కోరిక లెలా తీరుతాయి ? అసలు ఎన్నివందలు సంపాదించినా, నౌఖరీ, 'నౌఖరీ'యే కదా ! అందులో స్వతంత్రతకు ఏ కోశాన్నీ ఉండదుకదా! అదే వ్యాపార మైతే, ఎంత చిన్న పెట్టుబడితో ప్రారంభించినా, సవ్యంగా నడిపిస్తే త్వరలోనే వందలూ, వేలూ, లక్షలూ ఆర్జించవచ్చు గదా ! అసలు పెట్టుబడి అనేది మా నాన్నగారి చేతిలోంచి వూడిపడవలసిన అపురూప వస్తువైపోయి. వ్యాపార విషయం ఆయనదగ్గర ఎత్తితే వీపు సాఫవడం ఖాయమని తెలుసుకాబట్టి వూరుకున్నాను గాని, ఆయన ఇష్టపడితే ఏనాడో వ్యాపారం ఆరంభించి ఉండేవాణ్ణి. ఆయనదగ్గర పెట్టుబడి బిగిసిపోబట్టి, ఇంటిదగ్గర ఖాళీగా కూర్చోవలసి వచ్చింది. కాని లోలోపల నా చాతకానితనానికి ఎంత బాధపడుతూండేవాడినో ఆ భగవంతుడికే తెలుసు. వ్యాపారం చెయ్యాలనీ, డబ్బు సంపాదించాలనీ విపరీతమైన కాంక్ష నా హృదయాన్ని కొరికేస్తూండేది. కాని అవ

కాశం లేకపోవడంతో నిస్పృహా నిరాశలు నన్నావరిస్తూండేవి. సెప్టెంబరు పరీక్షకోసం చదువవలసి వచ్చి, నా గదిలో పుస్తకాల ముందు కూచునేవాణ్ణే కాని మనసు మాత్రం వ్యాపారం చెయ్యాలనే తహతహతో నిండి పుస్తకాలమీదికి ధ్యాస మళ్ళేదికాదు. అలా ఆలోచిస్తూ, హృదయావేదనతో, కిటికీ లోంచి ఎదుటింటివైపు చూసేవాణ్ణి. అలా చూసినప్పుడు, అప్పుడప్పుడు ఒక చల్లని ఆనందం అనుభవించేవాణ్ణి. ఎందుకంటే ఎదుటింట్లో కొత్తగా అద్దెకు దిగిన ఇంజనీరుగారి చెల్లెలు, పదిహేనేళ్ళ పెళ్ళికాని పిల్ల సూర్యకళ అనే ఒక అమ్మాయి తరుచూ నావైపే చూస్తూండేది.

పుస్తకాలలోనూ, కథలలోనూ చదివిన 'ప్రేమ' అనేది వాస్తవికంగా చూడాలనికూడా ఆ రోజుల్లోనే మనసులో ఆరాటం ప్రారంభమయింది. అయితే సూర్యకళ నన్ను ప్రేమిస్తోందా? లేదా ? ఎలా తెలుసుకోవడం ? ఆ గుండ్రని ఎర్రని మొహం లోని, విశాలమైన కళ్ళయొక్క చూపులోని ఆంతర్యం ఏ ప్రేమ డిక్షనరీలోకూడా రాసిలేదే, ఎల్లా గ్రహించడం ? కేవలం చూపులు విసరడం తప్ప మరేమీ చెయ్యని ఆ భామ మనసు ఎలా పసిగట్టటం ? ఇన్ని ఫార్ములాలు, సిద్ధాంతాలు కనిపెట్టి మా ప్రాణాలు తీస్తున్న ఈ విజ్ఞాన శాస్త్రజ్ఞులు, 'కాంతివేగం' 'థీరీ ఆఫ్ రెలెటివిటీ' అంటూ ఇదవకపోతే ఆడపిల్లల చూపుకు ఎన్ని 'హార్స్‌పవర్ల' శక్తి ఉంటుందో, ప్రేమ థీరీలో సరికొత్త

ప్రతిపాదనలూ దానికి సంబంధించిన ఈక్వేషన్లూ, రాసి పారేయ్యరాదు అప్పుడు చదువంటే, ఎంత మజాగా ఉంటుంది?

పైగా ఇలాటి విషయాలలో 'థీరీ' మీద ఆధారపడడం కన్నా 'ప్రాక్టికల్' విజ్ఞానం ఉండాలి. అసలు నా స్థితిలో గనక మా అవతారం ఉండిఉంటే ఈపాటికి ఎంతో 'ప్రోగ్రెస్' చూపించి ఉండేవాడు. అసలు ఆడవాళ్ళ చూపులోనే వాళ్ళ ఆంతర్యం గ్రహించొచ్చుట. మొదటిరోజు కళ్లు కలిసాయంటే రెండోరోజు మాట కలిపేస్తాడుట. మూడోరోజు రహస్య సమావేశంట అంత ప్రజ్ఞ వాడికుందని వాడి కబుర్లద్వారా తెలిసాక, సూర్యకళ విషయం వాడితో సంప్రదించ దల్చుకున్నాను. పైగా అనేకమంది స్నేహితుల ప్రణయ వ్యవహారాలు వింటుంటే నాకు మతి పోతుండేది. ఆమాత్రం చొరవ నాలో మాత్రం లేదా? అనిపించేది. అసలు వెంటనే ఒక ప్రేమలేఖను తయారుచెయ్య దల్చుకున్నాను. రెండురోజులు అతి కష్టపడి ఒక లేఖను తయారుచేశాను గాని, ఆమె కెలా అందివ్వాలో తెలియక, మా యింట్లో ఎవరికంట్లైనా పడితే ప్రమాదమొస్తుందని ఆ లేఖను చింపేశాను. ఇహ వెంటనే ఆలస్యం ఏమాత్రం చెయ్యదల్చుకోక, మా అవతారంగాణ్ణి ఆ సాయంకాలమే అలా పంపుల చెరువు వైపు తీసికెళ్ళి, నా సంగతంతా చెప్పేశాను. నేను సూర్యకళను ప్రేమించానన్నాను. ఎలాగైనా ఆమె ప్రేమను సంపాదించాలన్నాను. ఇది చాలా ముఖ్యమైన సమస్య అన్నాను వాడు నేను చెప్పినదతా విన్నాడు. కొన్ని ప్రశ్నలు

వేశాడు. ముఖ్యంగా ఆమె నావైపు చూపే చూపుల గురించి వివరంగా అడిగాడు నేను చెప్పినదంతా విన్నాక ఒక అమోఘమైన సలహా యిచ్చాడు. అది రెండో కంటివాడికి తెలియకూడదన్నాడు. వాడి మేధాశక్తికి నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత సూక్ష్మమైన సలహా మరెవరికైనా తట్టుందనికూడా అనుకోను. ఇక సూర్యకళ నాదేనని భావించసాగాను. మావాడి సలహా ఆచరణలో పెట్టడానికి వారం పదిరోజులు పట్టింది. తగిన సమయం దొరకక.

ఈ లోపల మా అవతారం వ్యాపార విషయమైన ప్రణాళి కల్ని డజన్లకొద్దీ ప్రతిపాదించసాగాడు. వాడి అభిమానవ్యాపారం కాఫీహోటలు పెట్టడం. నిద్రలోకూడా వాడు, "రెండుమినప్పట్లు! రోష్టు!" అని కేకలెడ్తూండేవాడు. నాకు కూడా కాఫీహోటలు వ్యాపారం అంటే ఇష్టమే, గల్లాపెట్టెదగ్గర కూచుని గంటకోసారి స్పెషలు కాఫీ సేవిస్తూ వింత వింత వ్యక్తులు వస్తూ పోతూంటే వాళ్లని పరిశీలిస్తూ, చుట్టూ ఫ్యానులూ, కుషన్ కుర్చీలూ, కుర్చీలో కదలకుండా కూచోడం— అన్నీ బాగానే ఉంటాయి. కాఫీహోటలు వ్యాపారంలోని కిటుకులన్నీ గంటలకొద్దీ మావాడు బోధిస్తూంటే నేను ఆసక్తిగా వినేవాణ్ణి. కాని ఒక చిన్నసైజు హోటలు పెట్టాలంటే ఎంత పెట్టుబడి కావాలి? అన్న విషయం చర్చించాక, అది మన కందుబాటులో లేదని స్పష్టంగా తేలిపోయింది. దానికి కావలసిన పెట్టుబడిలో నందో వంతైన నా దగ్గర లేదు. ఇహ ఈ చర్చల ఫలితంగా నిర్ణయిం

చిందేమిటంటే ఏదో ఒక పెట్టుబడి వ్యాపారం ప్రారంభించాలి, దానితో పెట్టుబడి సంపాదించాలి, అలా సంపాదించిన తరువాత ఆ పెట్టుబడితో గొప్ప వ్యాపారం చెయ్యాలి.

అప్పటినుండీ పెట్టుబడిలేని వ్యాపారం ఏదా! అని మూడహోరాత్రాలు ఏకధాటిగా ఆలోచించాం కాని అదేదో తట్టలేదు. అది ఉండితీరాలని నాకు నమ్మకం. రాక్ ఫెల్లరూ, హెన్రీఫోర్డూ అంత డబ్బు సంపాదించాలంటే వాళ్ళకేం పెట్టుబడుంది? కేవలం మేధాశక్తే వాళ్ళ పెట్టుబడి. పళ్ళపొడీ, వక్కపొడీ, మందులూ, సబ్బులూ, మొదలైన వ్యాపారాలు చిన్న పెట్టుబడులతో ప్రారంభించి, లక్షాధికార్లయిన వాళ్ళెంత మంది లేరు? చిన్న కిటుకేదో కనిపెట్టామంటే చాలు. ఆ కిటుకు ఒకనాడు హఠాత్తుగా మా అవతారంగాడి బుర్రలో తట్టేసింది. ఆ నాడు మా అమ్మ, బంగాళదుంపలు సన్నగా తరిగి వేయించింది. వాటిని చూడగానే వాడికి తట్టింది "చిప్స్" వ్యాపారం అద్భుతమైనదని. మావాడు గబగబ వ్యాపారం లెక్కలు వేశాడు. ఈ ఏలూరు అనే పట్టణంలో బోలెడన్ని ఆఫీసులున్నాయి. కాలేజీ ఉంది. క్లబ్బులున్నాయి. వీటన్నిటిలోనూ నాజూకైన నవనాగరిక యువకులెంతోమంది ఉన్నారు. వారందరికీ మధ్యాహ్నం కాఫీతోబాటూగాని సాయంకాలపు టీతోగాని ఏవైనా 'స్నాక్సు' కావాలి. కరకరలాడే, కమ్మని, బంగాళదుంప చిప్స వాళ్ళు ఒకొక్కటే నోట్లో వేసుకుంటూ అవి నోట్లో కరిగిపోతుంటే ఎంత ఆనందము, రుచీ, ఆరోగ్యం పొందుతారు! తాజాగా తయారుచేసిన చిన్న

చిప్స్ పాకెట్లు చేతిలో ఉండడం వాళ్లకెంతైనా అవసరం! ఆ అవసరం తీర్చడం మా వ్యాపారపు మొదటి మెట్టు, చిన్నచిన్న ప్లాస్టిక్ సంచీలలో ఆ చిప్స్ వేసి ఒకొక్కటి పావలా చొప్పున అమ్మేమంటే జనం వాటికోసం ఎగబడిపోయి గుద్దులాడుకుని తన్నుకు చస్తారు. అప్పుడు మాకు కావలసిన లాభం, సులభంగా వచ్చేస్తుంది. భోజనంపూర్తయ్యేలోపల వాడు నాకూ, అమ్మకూ ఒక చిన్న లెక్చరిచ్చి, చిప్స్ వ్యాపారంయొక్క గొప్పతనం మాకు తెలియ జేశాడు.

ఆనాటిరాత్రే మా వంటింట్లో 'చిప్స్' వ్యాపారసంస్థ గురించి ఒక ఉన్నతస్థాయిచర్చ ప్రారంభమైంది. అవతారం, నేనూ, మా అమ్మ, 'బోర్డ్ ఆఫ్ డైరక్టర్సు' మయ్యాం వాడిని మేనేజింగు డైరక్టరుగా ఎన్నుకున్నాం. మా నాన్నగారు వూరి కెళ్లడం మూలాన, మా మీటింగు నిర్విఘ్నంగా సాగింది. అయితే ప్రారంభపు పెట్టుబడి ఒక పది రూపాయలైనా కావాలని తేలింది. న్యాయంగా ఈ సంస్థయొక్క షేరుహోల్డర్లమైన మేము కొంత షేరు ధనాన్ని ఇవ్వవలసి ఉన్నా, మా ఆర్థిక వ్యవస్థ బొత్తిగా నీరసంగా ఉండడంవలన, ఈ ఆపద ఎలా గడు స్తుందా అని చూస్తున్నాం. 'ఒక్క పది రూపాయలుంటే చాలు, దానితో మొదటి రోజు చిప్స్ తయారుచేసి అమ్మా మంటే పదిహేను రూపాయలు వస్తాయి. రెండో రోజు పది హేను రూపాయలు సరుకమ్మామంటే ఇరవై రెండున్నర రూపాయలు వస్తాయి, అలా రోజూ వస్తున్న డబ్బును మళ్లీ

వ్యాపారంలో వినియోగించామంటే. ఒక రూపాయి పెట్టుబడికీ అర్ధరూపాయి లాభం చొప్పున, పదిహేను రోజులలో నాలుగు వేలు రూపాయలు సంపాదిస్తాం'' అన్నాడు అవతారం. అది విని అమ్మ ''నాలుగువేలే!'' అంది ఆశ్చర్యంగా.

''ఓ! కావాలంటే వాణ్ణడుగు, బి. యస్సి చదివాడుగా.'' అని నావైపు చూపించాడు. నేను లెక్కలు వేసుకుంటూ, పది రూపాయలతో ప్రారంభించి, పదిహేను రోజులకల్లా నాలుగు వేలు సరైన లెక్కేనని తేల్చాను. వెంటనే వ్యాపారం ప్రారంభించమని మా అమ్మ ఆదేశించింది. నేను ప్రారంభపు పెట్టుబడి గురించి హెచ్చరించాను. దానికి మా అమ్మ, ''అదేముందిరా, మన కాతా కొట్టులో నూనె తీసుకురండి. కూరగాయలవాడు కావాలంటే నాలుగు వీశెలు దుంపలు అరువిస్తాడు. తక్కినవి ఇంట్లో ఉన్నాయిగా'' అంది.

''వండ్రఫుల్. మన సమస్య తీరిపోయింది'' అన్నాడు అవతారం, నేనూ మా అమ్మ సూక్ష్మబుద్ధికి ఆశ్చర్యపోయి ''మరి ప్లాస్టిక్ సంచీలో?'' అన్నాను. ప్రక్కింటివాళ్లని రెండు రూపాయలు అప్పు అడిగి ఇస్తానని హామి యిచ్చింది.

ఆ రాత్రి నేనూ మా అవతారంగాడూ మా వ్యాపారపు భవిష్యత్తు గురించి, డాబామీద పక్క వేసుకుని పడుకుని చర్చించాము అతి కొద్ది రోజుల్లోనే అపరిమితంగా ధనం సంపాదించబోతున్నాం గనుక ఆ డబ్బంతా ఏం చెయ్యాలా అని ఆలోచించాం నామట్టుకు నేను సూర్యకళతో సహా ఏ బొంబాయో

వెళ్లి కొన్నాళ్లు జీవితం ఆనందించి, అనుభవించాలని నిశ్చయించాను. మావాడికి ఎన్నాళ్లనుండో ఒక సినిమా తియ్యాలని కోరికగా ఉందిట. దానికి కథా, సినేరియో, దర్శకత్వం హీరో, అన్నీ మావాడేట. హీరోయిన్‌గా ఒకఅమ్మాయిని కూడా చూసాడుట. నాకో చిన్న సైడురోలూ మా సూర్యకళకు చిన్న వేషం ఇస్తానన్నాడు. అలా కబుర్లలోంచి కలల్లోకి ఒరిగిపోయాం.

మరునాడు ప్రొద్దున్న పది గంటలకల్లా సరుకులన్నీ సమకూర్చుకుని చిప్స్ తయారుచెయ్యడం ప్రారంభించాం. రెండు గంటల టైమయ్యేసరికి సుమారు డెబ్బయి పాకెట్లదాకా తయారయ్యాయి. ఇంతలో మా యింటికి మా అమ్మగారి స్నేహితురాళ్లు నలుగు రొచ్చారు. సరదాకొద్దీ, వాళ్లను రుచి చూడమని నాలుగు పాకెట్లు ఇచ్చింది అమ్మ. తిని చాలా బావున్నాయని మెచ్చుకుని వెళ్లిపోయారు, వాళ్లు పొద్దుటినుండీ శ్రమపడి ఉన్నామేమో మాకూ కాస్త ఆకలయింది. అమ్మని 'టీ' పెట్టమని చెప్పి, మేము తలో రెండు పాకెట్లూ ఖాళీచేశాం. మొత్తనికి పది పాకెట్లదాకా అప్పటికప్పుడే ఖర్చయిపోయాయి. 'ఫ్రీ' గా నన్నమాట. అప్పుడు అసలు సమస్య మమ్మల్నెదుర్కొంది, ఈ చిప్స్ పాకెట్లను ఆఫీసులకీ, కాలేజీకీ తీసికెళ్లి ఎవరమ్ముతారూ ? —అని. నేను కాలేజీ స్టూడెంటునాయె, అందులోనూ నేను 'చిప్స్' పాకెట్లమ్మానని మా నాన్నగారికి తెలిస్తే, ఆయన నన్ను చిప్స్ కింద చీరేస్తారు. ఈ కారణాల

వల్ల నాకు వీలుకాదు. అంతవరకూ ఎంతో ఉత్సాహం చూపించిన మా అవతారం ఈ విషయంలో బెట్టుచెయ్యి సాగాడు. తను ఒకప్పుడు కాఫీహోటలు నడిపిన ఘటమయ్యే. ఎంతచెడ్డా ఆ పాకెట్లు చేత్తో పట్టుకుని తిరిగి అమ్మాలంటే ఎంత నామర్దా! బ్రతిమాలగా బ్రతిమాలగా చివరికి ఎవడైనా వెనక కూలీవాడు ఆ పాకెట్లనుమోస్తే, తను దగ్గరుండి అమ్మించడానికి అభ్యంతరమేమీ లేదన్నాడు. సరేనని ఎలాగో ఒక కుర్రాణ్ణి వాడికో నాలుగు పాకెట్లు ఫ్రీగా యిస్తామని ఆశపెట్టి మాట్లాడి ఒక సంచీలో ఆ పాకెట్లన్నీ వేసి, (ఎందుకైనా మంచిదని అయిదు పాకెట్లు ఇంట్లోనే ఉంచేశాను). వాడి చేతికిచ్చి పంపించాము, ముందు మా అవతారంగాడు, వెనుక కూలీవాడూ, వ్యాపారానికి బయల్దేరారు. నేను ఇంట్లో కూచుని, కొన్ని పత్రికలు ముందేసుకుని చదువుతూ, కిటికీలోంచి సూర్యకళ దర్శనం కోసం ఎదురుచూడసాగాను. సూర్యకళకు వో చిప్స్ పాకెట్ పంపిస్తే ఎలా ఉంటుంది! అక్కడ ఆ అమ్మాయి చిప్స్ తింటూ నన్నుతల్చుకుంటూ ఇక్కడ నేను చిప్స్ తింటూ ఆ అమ్మాయిని తల్చుకుంటూ — ఎంత మజా! కాని ఆ అమ్మాయి కన్పించలేదు. మరో విషయమేమిటంటే, ఆ క్రితం రోజు నుండే సూర్యకళ కిటికీ దగ్గర దర్శన మివ్వడం మానెయ్యటమే కాకుండా, ప్రమాదవశాత్తూ నాకంటపడితే, వెంటనే ఇంట్లోకి పారిపోవడం మొదలెట్టింది.

ఇలాటి పరిణామాలు వచ్చినప్పుడే, తగిన సూచనలు కావాలని నా బాధ. ఇప్పుడే చెయ్యాలి? మునుపు కిటికీదగ్గర నిలబడి వో నిమిషం నావైపు చూసేది. మరిప్పుడలా చెయ్యకుండా పారిపోతూంటే ఏమనుకోవాలి? సిగ్గా? మరింకేదైనా భావమా?

ఈ ఆలోచనలతో సతమత మవుతున్న మనస్సుతో సాయంకాల దాకా ఎలాగో గడిపాను. సాయంకాలం ఆరింటికి మా అవతారం తిరిగి వచ్చాడు వస్తూనే ఒ"గేయి! మన వ్యాపారం బ్రహ్మాండమైన సక్సెసు రా" అన్నాడు.

"ఏమాత్రం లాభం వచ్చింది?" అని అడిగాను.

"అప్పుడే లాభమేమిట్రా! ముందర అడ్వర్టయిజుమెంటు కావాలి. మనం ఒక క్రొత్త వ్యాపారసంస్థ పెట్టామని అందరికీ తెలియాలి. ముఖ్యంగా వనితా ప్రపంచానికీ ఈ సంగతి బోధపడాలి. ప్రతి యింట్లోనూ మన చిప్స్ గురించి వాదోపవాదాలు జరగాలి. స్త్రీలు మనపక్షం వహించిననాడు, ఇంటిల్లిపాదీ మన చిప్స్ కొనడం ప్రారంభిస్తారు. అదే ప్రకటన చిట్కా! 'లివర్ బ్రదర్స్' అటువంటి చిట్కాలతోనే గొప్ప సంస్థ యిది. నేనూ అదేపద్ధతి అవలంబించాను. కాలేజీలో అమ్మాయి లందరికీ ఒక్కొక్క పాకెట్టు పూరికే యిచ్చేశాను".

"పూరికే ఇచ్చావా?"

"అవునురా. ఇవాళ ఒక పాకెట్టు వూరికే ఇచ్చామంటే రేపు పది పాకెట్లు అమ్ముతా మన్నమాట. పాకెట్టిచ్చిన అమ్మాయితో నా గురించి..."

"నీ గురించా?"

"అంటే మన సంస్థ గురించీ, మనం అమ్మే చిప్స్ గురించీ ఒక చిన్న లెక్చరిచ్చాను".

"ఏమని"

"ఏముందీ, 'మేడమ్' నేను 'రావ్ అండ్ కో' ప్రొప్రయిటర్ని. మేము పొటాటో చిప్స్ ఆధునిక పద్ధతులలో, విదేశీయ యంత్రాలపై, వైజ్ఞానిక దృక్పథంలో తయారుచేస్తున్నాం. మీ రందరూ తెలుసుకోవడానికి ఫ్రీ పాకెట్టు ఒకటిస్తున్నాం. తిని చూడండి. వాటి అద్భుత గుణగణాలు మీకే తెలుస్తాయి. రేపటినుండి మధ్యాహ్నం రెండు గంటలకల్లా ఇక్కడ సరుకు రెడీగా ఉంటుంది. మీరంతా కొని, తిని, ఆనందించండి'—అని ఆడపిల్ల రందరకీ బోధించి వచ్చాను ఒరేయ్ బ్రదర్! కాలేజీలో భలే అమ్మాయిలున్నారా! వాళ్ళంతా మన మాటలకి ఐసైపోయారనుకో. గబగబా తలోపాకెట్టూ లాక్కుని తినేశారు. చాలా బావుందని మెచ్చుకున్నారు."

"అయితే అన్నీ వూరికే పంచిపెట్టేశావా?" అన్నాను జడుస్తూ. కొన్నైనా అమ్మి డబ్బులు తెచ్చుకుంటాడని ఆశిస్తూ.

"అసలు తీసికెళ్లినవి చాలందే. ఒక పాకెట్టు తిన్నవాళ్ళు మళ్ళీ మళ్ళీ కావాలని అడిగారు. ఎలాగో వాళ్ళకు నచ్చ చెప్పాను..."

అంతకన్నా ఎక్కువ తెలుసుకో నవసరం లేకపోయింది మా వ్యాపారం పుట్టిల్లోనే సంధి కొట్టిందని నిర్ణయించడానికి. రెండో రోజు మావాడెన్ని ప్లానులు వేసినా మళ్లీ చిప్స్ పాకెట్లు తయారుచెయ్యడం జరుగలేదు. ఎందుకంటే ఒక వేళ మళ్లీ కష్టపడి ఎలాగో తయారుచేసినా, వాటిని సవ్యంగా అమ్మి మావాడు డబ్బులు ఇంటికి తెస్తాడని ఎంతమాత్రం నమ్మకంలేదు. అప్పటికే రెండు మూడుసార్లు మా అమ్మ డబ్బులిచ్చి బజారునుంచి ఏదైనా వస్తువ తెమ్మని పంపితే అందులో సగానికి సగం కొట్టేశే వాడు. ఈ పరిస్థితుల్లో వాణ్ణి నమ్ముకుని వ్యాపారం చెయ్యడం అంత సమంజసం కాదని నేనూ మా అమ్మా నిర్ణయించాం. అసలు నాకు అప్పుడు సరిగా అర్థమైంది-వ్యాపారస్థుల మనసులు ఎంత ఆందోళనాభరితంగా ఉంటాయో! వ్యాపారము మానేద్దా మని నిర్ణయించాక మనస్సు తేలికైంది. రెండు మూడు రోజులు మానిర్లిప్తత చూసి అవతారం తాను ఖాళీగా కూర్చోలేక ఒక హోటల్లో సర్వరుగా కుదిరాడు. అసలు వాడంటే మా నాన్న గారికి వళ్ళుమంట. అందుకని వాడది గమనించి, ఆట్టే కాలం మా యింట్లో ఉండడం అంత క్షేమంకాదని అలా చేశాడు.

వ్యాపారం అగిపోగానే నా మనసూ, హృదయం, బుద్ధీ అన్నీ సూర్యకళమీద కేంద్రీకృతి మయ్యాయి. ఆమె ప్రేమ పొందనిదే నాకు శాంతిలేని స్థితి వచ్చేసింది, ఆరోజు ప్రొద్దున్న మానాన్నగారు వూరినుంచి వచ్చారు. ఆయన భోంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయిన దగ్గర్నుండీ కిటికీ వద్ద పుస్తకాలు వేసుకుని కూచుని సూర్యకళ కోసం ఎదురుచూడసాగాను. ఆరోజు ఎందుచేతో రెండు మూడుసార్లు నావైపు సాదరంగా చూసి వెళ్ళింది ఆమెకు నామీద తప్పక ప్రేమ ఉంటుందనుకున్నాను.

సాయంకాలం సుమారు ఆరు గంటలకు సూర్యకళ మా యింటికి వస్తూంటే చూసాను. పరికిణీ వోణీ వేసుకుని, తల నిండా పూలు పెట్టుకుని అప్సరసలా వస్తున్న సూర్యకళని చూడగానే నా హృదయము అదొకలాగయి, గుండె వేగంగా కొట్టుకోసాగింది. మా అవతారంగాడిచ్చిన సలహా ఆచరణలో పెట్టడానికి ఇదే సమయమని నిర్ణయించాను. ఎందుకంటే, మా అమ్మ పెరట్లో ఉంది గాబట్టి ఇక్కడేం జరిగినా ఆవిడకు తెలియదు. సూర్యకళ నాగది ముందునుంచే పెరట్లోకి వెళ్ళాలి.

నాగది ముందుకు రాగానే, "సూర్యకళా!" అని పిల్చాను. ఆమె ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది. అంతవరకూ ఇటూ అటూ వూగిసలాడుతున్న నా మనసులో మొండి ధైర్యం పెల్లుబికింది. "ఇలారా!" అన్నాను. ఎందుకో ననుకుని గదిలోకి వచ్చింది. అంతవరకూ నేననుకొన్నవిధంగా నిర్విఘ్నంగా జరుగుతూండడంవలన నాకింకా ధైర్యం వచ్చేసింది.

"నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను. నీకోసం ఎంత బాధపడిపోతున్నానో నీకు తెలియదు. నువ్వు నా దానివని తెలిసే దాకా నాకు తోచదు. మనిద్దరం ఎక్కడికైనా వెళ్లి పోదాం. హాయిగా, స్వేచ్ఛగా ప్రపంచంలో విహరిద్దాం" అన్నాను ఆ అమ్మాయి ఆవైపు తెలతెలబోతూ చూసింది. నేనన్న మాటల్ని అనుమానిస్తోం దేమోనని ఆమె కింకా ధైర్యం కలిగే టందుకు, ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని, "నే నెటువంటి ప్రమాణమైనా చేస్తాను" అన్నాను అంతకన్నా నేనేం చెయ్యా లేదు. కాని నేనేదో దుర్మార్గం చేస్తున్నట్లు— "ఛీ! ఛీ! వదలండి!" అంటూ తన చెయ్యిని లాక్కుని, రివ్వున వీధిలోకి పారిపోయింది సూర్యకళ.

ఆ అమ్మాయి నన్నపార్థం చేసుకుంటుందేమో నను కున్నాను. కిటికీ దగ్గర నుల్చొని, మళ్లీ కనిపిస్తుందేమోనని చూశాను. ఆమె మరి కన్పించలేదు. ఆ తరువాత ఏం జెయ్యాలో నాకు తోచలేదు. అవతారాన్ని కలుసుకుని వెంటనే ఈ విష యాన్ని వాడికి చెప్పడానికి కూడా వీల్లేకపోయింది ఆ రాత్రి. ఎలాగో ఆందోళనతో ఆ రాత్రంతా గడిపాను.

మర్నాడు పొద్దున్న ఎదురింటి ఇంజనీరుగారు మా నాన్న గారిని, "మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. ఒక సారి అలా రండి" అని వాళ్లింటికి తీసికెళ్లారు. మా అమ్మ నన్ను లోపలికి పిల్చి, "ఏమిరా! నువ్వు వాళ్లమ్మాయి

చెయ్యి పట్టుకున్నావా? ఏం పాడు బుద్ధిరా ఇది?" అని అడిగింది. లోకం నన్నిలా అపార్థం చేసుకుంటుందనీ, నా ప్రేమకు ఈ విధమైన వ్యాఖ్యానం వస్తుందనీ నేను కలలో కూడా వూహించకపోవడం వలన అమ్మ మాటలకు నేను చాలా బాధపడ్డాను. అమ్మ కొద్దిసేపు చివాట్లు పెట్టి వూరుకుంది. నాన్నగారేమంటారో అనే నేను భయపడ్డాను.

ఇంజనీరుగారింటికి వెళ్లి తిరిగివచ్చిన నాన్నగారు నాతోటేమీ మాట్లాడకుండా భోంచేసి ఆఫీసుకు వెళ్లిపోయారు. ఆయన వెళ్లిపోయాక అమ్మ చెప్పింది, నన్ను వెంటనే విశాఖపట్నం మా మేనమామగారింటికి వెళ్లి పరీక్షలు దగ్గర కొచ్చే వరకూ నన్ను అక్కడే ఉండమన్నారట. ఈ వూళ్లో చెడు సావాసాలూ, పాడు బుద్ధులూ ఎక్కువయ్యాయిట. అందుకని నా చదువు సాగదుట.

ఏదో చాల పెద్ద గొడవొస్తుందేమోనని భయపడ్డ నేను, ఈ మాత్రం శిక్షతో తేలి పోయినందుకు ఎంతో సంతోషించాను. సాయంకాలం రైలెక్కుతూ ఆఖరిసారి "హా! సూర్యకళా!" అనుకున్నాను. రైలు కదుల్తూంటే నేనున్న కంపార్టుమెంటులోకే అవతారం పరిగెత్తుకుంటూ వచ్చాడు. వీడింకా నన్ను వదల్డు కాబోలనుకున్నాను.

"ఒరే అర్జంటుగా అవసరం వచ్చింది రెండు రూపాయలియి." అన్నాడు. మాట్లాడ కుండా రెండు రూపాయ

లిచ్చాను. రైలు పవరుపేట స్టేషను వదిలిపెట్టేసింది, "నువ్వు కూడా వస్తున్నావా?" అని అడిగాను. వాడు, "లేదురా మా నాన్న నీ సూర్యకళ వ్యవహారానికంతా నేనే కారణమనీ, నీ జోలికి రావద్దనీ, గట్టిగా వార్నింగిచ్చాడు. పోనీలే పెద్దవాడు కదా అని వూరుకున్నాను. నీలాటి కుర్రాళ్లకి అలాటి అనుభవాలు చాల అవసరం. వ్యవహారం బెడసిందని బెదిరిపోకు. జీవితంలో ఆడదాని చేతి లెంపకాయ తినని వాజమ్మలా ఉండి పోవడం కన్నా, కాస్త చెంపపోటు తిన్న మగవాడిలా బ్రతకడం ఎంతో అవసరం." అంటూ ఏలూరు స్టేషను రాగానే దిగిపోయాడు. నేను, "చెంప తడుముకుంటూ, సూర్యకళ ధర్మమా అని చెంప వాయలేదని అనుకుంటూ, వెళ్లిపోతున్న అవతారం వైపు చూస్తుంటే రైలు కదిలింది.

